విశాలాంధ్ర కృష్ణా జిల్లా

'వరి నారు'కు పెరిగిన డిమాండ్

పెరిగిన ధరలతో రైతులకు తప్పని తిప్పలు.

విశాలాంధ్ర-కూచిపూడి : గత నెలలో కురిసిన అధిక వర్షాలతో ఒకవైపు నాటు వేసిన పొలాలు, ఇంకోవైపు వరి నారుమడులు దెబ్బతినడంతో పాడైపోయిన పొలాలలో మరల నాటు వేసుకోవడానికి నారు కొరత ఏర్పడింది. దీనితో నాట్లు వేసుకొన్న రైతుల వద్ద మిగిలిన నారుమడులకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. గత ఏడాది అధికంగా పోసుకున్న నారుమడులతో తిప్పలుపడ్డ రైతులు ఎవరికి వారు సరిపడా నారుమడులు పోసుకున్నారు. అయితే ఆదిలోనే హంసపాదనట్లుగా ప్రకృతి పగబట్టి వర్షాల రూపంలో రైతులను నట్టేట ముంచింది .దీనితో వరి నారుమడుల ధరలకు రెక్కలు వచ్చేశాయ్. ఒకసెంటు నారుమడి సుమారు రూ, వెయ్యి నుంచి రూ.15 వందలకు పైగా పలుకుతోంది. కొన్ని చోట్ల అది రెండు వేలకు పైగా చేరుకొన్నట్టుతాజా సమాచారం!. వ్యవసాయ శాఖ రాయితీ మీద వరి వంగడాలను ఇస్తామని ప్రకటించినా ఆసక్తి కనపరచనీరైతులు చేతికి అందిన నారును అధికధర చెల్లించైనా కొనుక్కొని తీసుకెళ్లడానికి నిశ్చయించుకుని గ్రామాలలో వేట మొదలుపెట్టారు. అదేవిధంగాఈఏడాది అధిక సంఖ్యలో"వెద"పద్ధతిన వరి సాగు చేసిన పొలాలలో కొన్నింట్లో అధికంగా నీరు నిలబడి మొలక దెబ్బతింది. దీంతో ఆ రైతులు కూడా కూలీలతో నాటు వేయించుకోవడానికి పొలాలు దమ్ము చేయించుకుని వరి నారు కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితులలో మొవ్వ, పమిడిముక్కల, గూడూరు, బందరు, ఘంటసాల, పామర్రు తదితర మండలాల్లో గల వరినారును కొనుగోలు చేసుకుని ట్రాక్టర్ల పై తెచ్చి నాటు వేసుకుంటున్నారు.

చదువంటే మాకు ఇష్టం

విశాలాంధ్ర-అవనిగడ్డ : చదవటం మాకు ఎంతో ఇష్టం కార్యక్రమాన్ని గ్రేడ్ 1 గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. పాఠకులు విద్యార్థులు పరీక్షలలో పోటీపడే అభ్యర్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చదవడం మాకు ఎంతో ఇష్టం కార్యక్రమానికి పాఠకుల నుండి విశేష స్పందన వస్తున్నట్లు గ్రంధాలయ అధికారి ప్రభుదాస్ తెలిపారు.

గద్దర్ మృతి దిగ్భ్రాంతికి గురిచేసింది - మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : తన పాట ద్వారా తెలుగు జాతిని ప్రభావితం చేసిన గద్దర్ ఆకస్మిక మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గద్దర్ మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మండలి అనేక ఉద్యమాలకు గద్దర్ పాటలు ఊపిరి అందించినది అని, ప్రజా వాగ్గేయకారుడిని తెలుగు జాతి కోల్పోయిందని ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ఒక ప్రకటనలో తెలిపారు.

స్వచ్ఛ సుందరీకరణకు రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర-చల్లపల్లి : స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధన కోసం అభివృద్ధి సుందరీకరణ పనులు చేపడుతున్న మన కోసం మనం ట్రస్టు స్వచ్ఛ కార్యకర్త, రైతు పెద్దలు సజ్జా ప్రసాద్ రూ.లక్ష వితరణగా అందచేశారు. ఆదివారం 2844వ రోజు స్వచ్ఛసేవలో పాల్గొన్న ఆయన ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, స్వచ్ఛసారధి డాక్టర్ డిఆర్.ప్రసాదుకు లక్ష చెక్కును అందించారు. ఇప్పటివరకూ సజ్జా ప్రసాద్ ట్రస్టు్కు రూ.మూడు లక్షలకు పైగా విరాళం అందచేశారు. స్వచ్ఛ కార్యకర్తల తరపున డీఆర్కే దాత ప్రసాదుకు కృతజ్ఞతలు తెలిపారు.

చినపారుపూడిలో ఓటర్ లిస్ట్ పరిశీలన

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని చిన్నపారుపూడి గ్రామంలో బూతు లెవెల్ అధికారి శ్రీనివాసరావు ఓటర్ లిస్టు ఆధారంగా ఇంటింటికి తిరుగుతూ పేరు,డోర్ నెంబర్లు ఏమైనా మార్పులు ఉన్న ఎడల సరిచేసుకోవచ్చునని, అలాగే 18 సంవత్సరములు నిండిన యువతీ, యువకులు నూతనంగా ఓటు హక్కు పొందేందుకు అవకాశం ఉన్నదని వివరిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై హర్షం

విశాలాంధ్ర-విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ అవుట్సోర్సింగ్ సర్వీస్ అనే ప్రభుత్వరంగ కార్పొరేషన్ ఏర్పాటు, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా ఉద్యోగుల నుంచి అభినందనలు తెలిపారు. తాడేపల్లి రాష్ట్ర కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. కృతజ్ఞతలు తెలియజేస్తూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరగా దానికి వారు సానుకూలంగా స్పందించటం ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల రెవెన్యూ టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్లు, ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ వివిస్ దివాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

మణిపూర్‌లో నిందితుల్ని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-విజయవాడ : మణిపూర్‌లో అల్లర్లకు కారణమై, మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుల్ని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య డిమాండ్ చేసింది. పెనమలూరు గ్రామంలోని అంబేద్కర్ నగర్‌లో ఆదివారం కృష్ణాజిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా కమ్యూనిస్టు సమితి ఇన్చార్జి కార్యదర్శి టీ తాతయ్య మాట్లాడుతూ కేంద్రంలో పరిపాలిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ హింసలను ప్రేరేపిస్తూ మణిపూర్‌లో జరుగుతున్న హింసలకు, మానభంగాలకు హత్యలకు పరోక్షంగా కేంద్ర ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. ఈ నేపథ్యంలో భారతదేశంలో లౌకిక రాజ్యాంగానికి విలువ లేకుండా మైనార్టీ మతస్తుల్ని చంపేయటం దానికి ప్రభుత్వమే అవకాశం ఏర్పరచడం దుర్మార్గమైన చర్య అన్నారు. పెనమలూరు నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి మున్నంగి నరసింహారావు మాట్లాడుతూ రాజ్యాంగంలో మహిళలకు కల్పించిన హక్కులను కాలరాస్తూ మణిపూర్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని, తక్షణమే మణిపూర్ ప్రభుత్వాన్ని రద్దుచేసి అక్కడ ఎమర్జెన్సీ ఏర్పాటుచేసి ప్రజలను రక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెనమలూరు సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి వి.బాలస్వామి మాట్లాడుతూ దేశంలో మహిళలు కిడ్నాపింగ్ బాలికలపై అత్యాచారాలు పెరిగాయని, కొన్ని వేలమంది బాలికలు కిడ్నాపై అడ్రస్సులేకుండా ఉన్న పరిస్థితి నెలకొందన్నారు. ఈ దుస్థితి నుంచి మహిళలను కాపాడాలని కోరారు.

పుంగనూరు ఘటన చంద్రబాబు కుట్రే : ఎమ్మెల్యే సింహాద్రి

విశాలాంధ్ర-అవనిగడ్డ : పుంగనూరులో జరిగిన సంఘటనకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పన్నిన కుట్రేనని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఆయన ఆదివార తన కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోరుతూ ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తూ పేదల పాలిట పెన్నిదిగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ప్రభుత్వ ఎం.ఎల్.ఎ లను గడపగడపకి మన ప్రభుత్వం ద్వారా ఇంటింటికి పంపించి వారి సమస్యలను తెలుసుకుంటూ సంక్షేమ పాలన అందిస్తున్నారని ఇది చూచి ఓర్వలేని టిడిపి నేతలు దిగజారుడు పనులకు శ్రీకారం చుట్టారన్నారు. అల్లర్లు అక్కడ సృష్టించి, ధర్నాలో కొవ్వొతుల ప్రదర్శనలు చేయిండం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి తుంగల సుమతీ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాషా, మండల యుత్ కన్వీనర్ చింతలపూడి బాలు, మండల వైస్ ఎం.పి.పి దిడ్ల కిరణ్, మాజీ ఉపసర్పంచ్ గాజుల జయ గోపాల్, మాజీ సర్పంచ్ సైకం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై పకడ్బందీగా వెరిఫికేషన్ చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : పారదర్శక ఓటర్ జాబితా తయారీకి బూత్ లెవల్ అధికారులు (బీఎల్వో) సమగ్ర డోర్ టు డోర్ వెరిఫికేషన్ కీలకమని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశాల మేరకు సెంట్రల్ నియోజకవర్గంలో ఆదివారం కమిషనర్ దుర్గ అగ్రహారం, ఎస్ఎస్ఏం బోస్ నగర్, వాంబే కాలనీ, కండ్రిక, 236 పోలింగ్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న డోర్ టు డోర్ ఓటర్ సర్వేని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 ఓటర్ల జాబితాకి సంబందించి డోర్ టు డోర్ సర్వేను బీఎల్ఓలు పక్కాగా చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు సూపర్వైజరి అధికారులు మరింత భాధ్యతగా సర్వేని పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024లో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జూలై 21 నుండి ఆగస్టు 21వ తేది వరకు బూత్ స్థాయి అధికారులు డోర్ టు డోర్ వెరిఫికేషన్ ద్వారా ఓటర్ల జాబితాను పరిశీలిస్తారన్నారు. బీఎల్ఓ యాప్‌లో ఎక్కడైనా సమస్య ఎదురైతే వెంటనే నగర పాలక సంస్థ ఎన్నికల విభాగ సిబ్బందిని సంప్రదించాలన్నారు. బీఎల్ఓలు నగర పాలక సంస్థ నుండి అందించిన గుర్తింపు కార్డులను ధరించి సర్వేలో పాల్గొనాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ రామమోహన్‌రావు, సూపర్వైజర్‌లు, ఏఈఆర్‌వోలు, వీఎంసీ అధికారులు, బీఎల్ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల చరిత్ర ఘనమైనది : మాచవరపు

విశాలాంధ్ర-ఘంటసాల : ఘంటసాల చరిత్ర ఎంతో ఘనమైనదని ఇటువంటి పురాతన గ్రామాన్ని సందర్శించటం చాలా ఆనందంగా ఉందని ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్, ప్రముఖ రచయిత డాక్టర్ మాచవరపు ఆదినారాయణ అన్నారు. ప్రముఖ శైవ బౌద్ధ క్షేత్రంగా విరాజిల్లుతున్న ఘంటసాల గ్రామాన్ని ఆదినారాయణ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బౌద్ధ స్తూపం, బౌద్ధ మ్యూజియం, శ్రీ బాలపార్వతి సమేత జలదీశ్వర స్వామివారి ఆలయంలో ఏకపీఠం పై కొలువైయున్న శివపార్వతులను దర్శించుకుని ఘంటసాల గ్రామ వారసత్వ చిహ్నాలైన గౌతమ బుద్ధుడు, ఘంటసాల వెంకటేశ్వరరావు, శివుని విగ్రహాలు సందర్శించారు. అనంతరం ఆదినారాయణ మాట్లాడుతూ ఘంటసాలలో 2వ శతాబ్దపు బౌద్ధ స్థూపాన్ని, పురావస్తు మ్యూజియం సందర్శించానని, ఘంటసాల చరిత్ర ఎంతో ఘనమైనదని, ఇటువంటి పురాతన గ్రామాన్ని సందర్శించటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఏడు ఖండాలు, 14 దేశాలు, 30000 కిలోమీటర్లు ప్రయాణించిన యాత్రికుడు, భ్రమణ కాంక్ష, కాలి బాటలు నా స్వర్గ ద్వారాలు, భూభ్రమణకాంక్ష, తెలుగు వారి ప్రయాణాలు వంటి పుస్తకాలను రచించిన డాక్టర్ మాచవరపు ఆదినారాయణకు కృష్ణా జిల్లా మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ , మన ఘంటసాల.నెట్ నిర్వాహకులు రాజేష్ వేమూరి ఘంటసాల లోని అన్ని ప్రదేశాలు చూపించి శాలువతో సత్కరించి జ్ఞాపికను, ఘంటసాల చరిత్ర పుస్తకాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎరుకుల, యానాదుల అభ్యున్నతికి కృషి : మద్దెల

విశాలాంధ్ర-గుడివాడ : గిరిజన జాతి ఎరుకల యానాదుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, వీరందరి ఆర్థిక బలోపేతానికి సహకారం అందించేలా కార్పొరేషన్ ద్వారా బ్యాంకుల నుండి రుణాలను సైతం అందించి వారి జీవితాలను మెరుగుపరిచేలా ముఖ్యమంత్రి జగనన్న పరిపాలన అందిస్తున్నారని ఎస్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దెల రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక బంటుమిల్లిరోడ్డులోని వంకాదారు కాల్యాణమండపంలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ గుడివాడ శాఖ అధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మద్దెల రామకృష్ణ మాట్లాడుతూ గిరిజన జాతిబిడ్డలు ఉన్నత చదువులు చదువుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలను అందిస్తుందన్నారు. వాటన్నిటిని అందిపుచ్చుకొని రానున్న తరాలు విద్యావంతులుగా ఎదిగి రాష్ట్రంలో మంచి కీర్తి ప్రతిష్టలు సంపాదించేలా కృషి చేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని మనందరికీ అండగా ఉంటారని, ఎటువంటి ఆపద వచ్చిన అయన దృష్టికి తీసుకు వెళ్ళాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షులు మట్టా జాన్‌విక్టర్, వైసీపీ సీనియర్ నాయకులు గద్దె రాము, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, గుడివాడ శాఖ అధ్యక్షులు శీలం దానయ్య, ప్రధాన కార్యదర్శి శీలం రాంబాబు, నాయకులు ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం కూచిపూడి పంచాయతీ పరిధి లోని నాలుగు అంగన్వాడి కేంద్రాల లో గల గర్భిణీలకు బాలింతలకు రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయంలో వైయస్సార్ సంపూర్ణ పోషణ ఆహారాన్ని పంపిణీ చేశారు, ఈ కార్యక్రమాన్నికూచిపూడి రోటరీ క్లబ్ సభ్యుల సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి కొండవీటి అమరబాలేశ్వరరావు దంపతులు, పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ పి. నిహారిక,రోటరీ క్లబ్ అధ్యక్షుడు కార్యదర్శి కె. రామాంజనేయులు, వి. రవిబాబు, రోటరీ క్లబ్ పి ఆర్ ఓ పాగోలురమేష్ బాబు, సచివాలయ మహిళా పోలీస్ జి.భార్గవి, సంజీవిని వైద్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జొన్నలగడ్డ హనుమకుమార్, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షల నేపథ్యంలో ఘర్షణ - మహిళకు గాయాలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: పాతకక్షల నేపథ్యంలో ఆదివారం చెలరేగిన ఘర్షణతో ఒక మహిళ తీవ్రగాయాలకు గురయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని వేమిరెడ్డిపల్లి పంచాయతీ శివారు తువ్వచిలక గ్రామానికి చెందిన తూనూరి వజ్రకుమారికి, ఇదే గ్రామానికి చెందిన ఆమె కుటుంబసభ్యులకు పాతకక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వజ్రకుమారిపై ఆమె సమీప బంధువులు ఆమెపై దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని సమాచారం అందుకున్న విస్సన్నపేట 108 సిబ్బంది తిరువూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. తనపై, తన భర్త, పిల్లలపై తమ సమీప బంధువులు ఆస్తి వివాదం నేపథ్యంలో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, రక్షణ కల్పించాలని శనివారం విస్సన్నపేట పోలీసులను సైతం ఆశ్రయించటంతో ఈ దాడి జరిగిందని బాధితురాలు తెలిపారు.

బైక్ దగ్ధం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): బుల్లెట్ అగ్నికి ఆహుతి అయింది. ఈ ఘటన ఆదివారం విజయవాడ సూర్యారావు పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఉదయ్ శంకర్ అనే వ్యక్తి తన బుల్లెట్ బైక్ పై బీసెంట్ రోడ్డు నుండి పుష్పా హోటల్ సెంటర్‌కు వస్తున్న సమయంలో రోడ్డు మీద అడ్డంగా కేబుల్ వైర్ మెడకు చుట్టూకొని కిందపడిపోయాడు. బైక్ అదుపు తప్పి పెట్రోల్ ట్యాంక్ నుండి పెట్రోల్ బయటికి వచ్చి ఒక్కసారిగి మంటలు చెలరేగాయి. దీంతో రోడ్డు పై బుల్లెట్ అగ్నికి ఆహుతి అయింది. వెంటనే స్థానికులు నీరు తీసుకుని వచ్చి మంటలను అదుపు చేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీ

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ కార్పొరేషన్ (సిహెచ్ఆర్ఎంసి) ఇండోర్ స్టేడియంలో ఆదివారం ముగిసిన ఐఎల్ఐఎస్ ఆధ్వర్యంలో జరిగిన రెండవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో విజయవాడకు చెందిన ఎస్‌జిటిటిఎ పాడ్లర్ ఆర్ కాజోల్ సునర్ మహిళల సింగిల్స్ మరియు మిక్స్‌డ్ డబుల్స్‌లో డబుల్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. పురుషుల విభాగంలో పోస్టర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పవన్‌కుమార్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ విజేతగా నిలిచారు.మహిళల సింగిల్స్ ఫైనల్స్‌లో ఆర్ కాజోల్ సునర్ (ఎస్‌జీటీటీఏ) 3-1 సెట్లలో శైలా నూర్ బాషా (డీటీటీఏ)పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో పవన్ కుమార్ (పోస్టల్) 4-0 వరుస సెట్లలో టి ప్రభాత్ సాయి (రాజమహేంద్ర వరం)పై గెలిచాడు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్‌ఆర్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ విజేతలకు, రన్నర్‌లకు పతకాలను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కెవిఎస్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పి విశ్వనాథ్, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె బలరాం తదితరులు పాల్గొన్నారు.

కావేరి టైల్స్ పార్క్ అండ్ శానిటరీ వెర్ ప్రారంభం

విశాలాంధ్ర-నందిగామ రూరల్ : పట్టణంలోని కోర్టు రోడ్డులో ఆదివారం ప్రముఖ వ్యాపారవేత్త నర్వనేని మురళి ఆధ్వర్యంలో కావేరి టైల్స్ పార్క్ అండ్ శానిటరీ వెర్ ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయవాడ ఎంపీ కేసినేని శ్రీనివాస్ (నాని) విశిష్ట అతిథులుగా ఎంపీ మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్,, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఇన్వెంట ఇండస్ట్రియల్ చైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ హాజరు అయ్యారు. ముందుగా పట్టణ శివారు బైపాస్ నుంచి భారీ ర్యాలీగా వచ్చి సీఎం రోడ్డు గాంధీ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. రైతు పేటలో భారీ గజమాలతో కేశినేని నాని కి స్వాగతం పలికారు. పట్టణంలో భారీగా ప్రారంభోత్సవ ఫ్లెక్సీ ఏర్పాట్లు చేశారు. ప్రారంభోత్సవ అనంతరం ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ నందిగామ పరిసర ప్రాంత ప్రజలు విజయవాడ వెళ్లే అవసరం లేకుండా అన్ని కంపెనీల టైల్స్,సానిటరీ వేర్ సామాన్లు లభ్యమవుతాయనీ,హోల్సేల్ రేట్లకి రిటైల్ అమ్మకాలు చేసి, నాణ్యమైన వస్తువులను ప్రజలకు అందించాలని ఆయన కోరారు. చందర్లపాడు మండలం గుడిమెట్ల గ్రామంలో గత పది రోజుల నుండి మంచినీరు లేదని స్థానిక నాయకులు కన్యకంటి జీవరత్నం గ్రామస్తులతో కలిసి ఆయనకు తెలియపరచిన నేపథ్యంలో వెంటనే సంబంధిత సమస్యపై దృష్టి సారిస్తానని పేర్కొన్నారు కొందరు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ పార్టీలో ఎటువంటి అంతర్గత విభేదాలు లేవని స్థానిక మాజీ ఎమ్మెల్యే తనకు ఎటువంటి భేదాభిప్రాయాలు లేవని పేర్కొన్నారు తాను ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంలో ఆమె రాలేకపోయిందని తెలిపారు రానున్న రోజుల్లో మరింత అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు ఆహ్వానం మన్నించి విచ్చేయుచున్న పార్లమెంటు కేసినేని నాని గారికి, విశిష్ట అతిథులుగా విచ్చేసిన ప్రతి ఒక్కరికి తమ అభిమానులకు తమ వ్యాపార అభివృద్ధికి మద్దతు పలికిన ప్రతి ఒక్కరికి కావేరి టైల్స్ పార్క్ అండ్ శానిటరీ వెర్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు మురళి తెలిపారు.

యువతలో బీపీ నివారణకు గ్లెన్మార్క్ ఫార్మా, ఒమ్రాన్ హెల్త్ కేర్ ఇండియా ల టేక్ చార్జ్ ఏ18

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): యువత వయసు నుంచి ఇంట్లోనే రక్తపోటు పరీక్షలు చేసుకోవడంపై అవగాహన పెంచేందుకు పరిశోధనలకు పెద్దపీట వేసి ప్రముఖ ఇంటిగ్రేటెడ్ అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ కంపెనీ గ్లెన్మార్క్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ (గ్లెన్మార్క్), ఈ విషయంలో అంతర్జాతీయంగా పేరుగడించిన, గుండెకవాటాల వ్యాధుల పరిష్కార జపనీస్ సంస్థ భారతీయ విభాగం అయిన ఒమ్రాన్ హెల్త్ కేర్ ఇండియా చేతులు కలిపాయి. రక్తపోటు స్క్రీనింగ్ ప్రారంభించడానికి సరైన వయస్సుపై నిర్దిష్ట మార్గదర్శకాలు లేకపోవడంతో చాలామంది దీన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనివల్ల రక్తపోటు, దానివల్ల వచ్చే సమస్యలకు గురవుతారు. ఈ క్లిష్టమైన సమస్యకు పరిష్కారం కోసం, గ్లెన్ మార్క్ దేశవ్యాప్తంగా 94 మంది కార్డియాలజిస్టులతో చర్చలు ప్రారంభించింది. రక్తపోటు పరీక్షలు ప్రారంభించడానికి 18 ఏళ్లు అనువైన వయస్సు అని ఏకాభిప్రాయానికి దారితీసింది.

ఆముదార్లంకలో ఇసుక అక్రమ రవాణా?

విశాలాంధ్ర-చల్లపల్లి : గుంటూరు జిల్లాలో అంతర్భాగంగా కృష్ణానదీతీరాన ఉండే చల్లపల్లి మండల పరిధిలోని ఆముదార్లంకలో అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రేవులోంచి నిత్యం ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేస్తుండటంతో స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రహదారులు పాడవుతున్నాయంటూ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ను మహిళలు అడ్డగించటం, ట్రాక్టర్ డ్రైవర్ దురుసుగా ప్రవర్తించి ట్రాక్టర్కు అడ్డుగా ఉన్న వృద్ధుడి మీదకి ట్రాక్టర్ను దూకించిన సంఘటన ఇటీవల జరుగ్గా, ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్గా మారిన విషయం తెలిసిందే. ఆ సంఘటనపై మహిళ ఫిర్యాదు మేరకు చల్లపల్లి పోలీస్‌స్టేషన్లో కేసు సైతం నమోదైంది. ఇసుక అక్రమ రవాణా విషయమై వివాదాలు జరగటం, కేసుల వరకూ వెళ్లినప్పటికీ రేవు నుంచీ ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగటంలేదు. ఆముదార్లంక గ్రామానికి చుట్టుపక్కల ఉండే గుంటూరు జిల్లాలోని గ్రామాల నుంచీ ట్రాక్టర్ డ్రైవర్లు ఆముదార్లంక పరిధిలోని రేవులోకి వచ్చి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పాలకేంద్రం రోడ్డు మీదుగా ప్రాంతం నుంచీ రేవులోకి వెళ్లి ఇసుకను రవాణా చేస్తుంటారు. పల్లపు ప్రాంతం, రహదారులు సరిగాలేకపోవటంతో ఇసుక రవాణా కారణంగా ఉన్న రోడ్లు గోతులుపడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు ఇసుక అవసరం అని అనుమతులు తీసుకుని ఇసుక తోలగా, ఆ వంకతో అక్రమార్కులు యధేచ్ఛగా ఇసుకను తవ్వుకు పోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు దాడులు నిర్వహిస్తే, గుంటూరుజిల్లాలోని ప్రభుత్వ క్వారీ నుంచీ జగనన్న ఇళ్లకు ఇసుక కోసం తీసుకున్న బిల్లులను చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆముదార్లంక గ్రామం గుంటూరు జిల్లాలో కలిసి ఉండటం, ఫిర్యాదులపై గ్రామానికి వెళ్లాలంటే పులిగడ్డ వారధి మీదుగా వెళ్లాల్సి రావటం అధికారులకు ప్రయాసతో కూడుకున్న పని. ఇదే అదనుగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరగటం పరిపాటిగా మారింది. అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ఇసుక అక్రమ రవాణాపై ఫొటోలు, వీడియోలు తీస్తుంటే కొందరు తమకేమీ పట్టనట్లు వెళ్లిపోతుండగా, కొందరు మాత్రం ఫొటోలు ఎందుకు తీస్తున్నారంటూ రుబాబుకు వస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఆముదార్లంకలో ఇసుక అక్రమ రవాణాపై దృష్టిసారించి అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రైనేజీ, సీసీరోడ్డు సమస్య పరిష్కారం

విశాలాంధ్ర-కంచికచర్ల : పాత శివాలయంరోడ్డులో ఉన్న డ్రైనేజీ కాలువ, సిమెంట్ రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు.కంచికచర్ల పాత శివాలయం రోడ్డు డ్రైనేజీ వ్యవస్థ అంతంతమాత్రంగానే ఉండడంతో పాటు మాములు రోజుల్లోనే వాడుకున్న నీరు డ్రైనేజ్ పొర్లి రోడ్డు మీద కు నీరు వచ్చేది.ఆ రోడ్డు లో నడవాలంటే ఎంతో కష్టంగా ఉండేది.ఆదే వర్షాకాలం వచ్చిందంటే చాలు ఇక చెప్ప అక్కర్లేదు, మురికి నీరు లో నడవాలంటే ప్రజలు, భక్తులు వాహనదారులు నరకయాతన పడేవారు. ఈ విషయాన్ని పలుమార్లు 6వ వార్డు ఇన్ చార్జి దేవరకొండ గురవయ్య, ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు కు స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు స్వయంగా పరిస్థితి పరిశీలించి ప్రజాప్రతినిధులకు అధికారులకు యుద్ధప్రాతిపదికన సచివాలయం 1నుండి వచ్చే నిధులతో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడం ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు పనులు చేపట్టడం జరిగింది. పనిలోపనిగా మురికి కాలువ డ్రైనేజీ పనులతో పాటు సిసి రోడ్డు పల్లం అవడంతో స్వయంగా ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు తో మాట్లాడి సిమెంట్ రోడ్డు కు కూడా నిధులు మంజూరు చేయించి సిమెంట్ రోడ్డు కూడా పూర్తి చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు, దేవరకొండ గురవయ్య నారిశెట్టి శ్రీను గోగినేని వెంకటేశ్వరరావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్ర జయప్రదానికి సన్నద్ధం కండి

సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు పిలుపు

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : దేశాన్ని కాపాడుకుందా.. రాష్ట్రాన్ని రక్షించుకుందామనే లక్ష్యంతో ఈనెల 17వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు సీపీఐ ఆధ్వర్యంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నాయకత్వాన ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న బస్సుయాత్ర జయప్రదానికి మనపార్టీ, ప్రజా సంఘాల యంత్రాంగం సమాయత్తం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు.

రెడ్డిగూడెం మండలం రాఘవాపురంలో ఆదివారం జరిగిన ప్రచార కార్యక్రమంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ కుల, మత, భాష, ప్రాంత, జతులమధ్య చిచ్చుపెట్టి దేశ ప్రతిష్టను, మనుగడను దెబ్బతీస్తున్న బీజేపీ పాలన రాక్షస చర్యలను తలపిస్తున్నాయని, ఇందుకు మణిపూర్ హార్యానా రాష్ట్రాలలో జరుగుతున్న మారణ కాండాలే ప్రత్యక్ష సాక్ష్యాలని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి అనేదే లేకుండాపోయిందని అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి ప్రజలు సతమతమవుతుంటే అటు కేంద్రంగాని, రాష్ట్ర ప్రభుత్వం గాని నిమ్మకు నీరెత్తినట్లుగా చోద్యం చూస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. ఈ పరిస్థితులలో సీపీఐ నిర్వహిస్తున్న బస్సుయాత్రకు అత్యంత ప్రాధన్యత సంతరించుకుందని, ఈయాత్ర జయప్రదాన్నికి యావత్తుయంత్రాంగం శ్రమించాలని అన్నారు. ఈ నెల 24న రెడ్డిగూడెంలో ప్రవేశించి మైలవరం నియోజకవర్గంలో పర్యటించి సాయంత్రానికి చేరుకునే నేపథ్యంలో జిల్లా పార్టీ, ప్రజాసంఘాల కృషి చేసి జయప్రదం చేయాలని అన్నారు.

సీపీఐ బస్సు యాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ : మోదీ హఠవో దేశ్‌కి బచావో అని కోరుతూ ఈనెల 17న విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద నుంచి ప్రారంభం కానున్న సీపీఐ బస్సు యాత్రను జయప్రదం చేయాలని తిరువూరు నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో సీపీఐ బస్సు యాత్రను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య పిలుపునిచ్చారు. తిరువూరు సీపీఐ నియోజవర్గ సమితి సమావేశం ఆదివారం సుంకర వీరభద్రరావు భవన్‌లో మాలపాటి ఉదయ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రాన్ని కాపాడండి- దేశాన్ని రక్షించండి అని కోరుతూ, ఎకరానికి పదివేల రూపాయలు సాగు సాయం అందించాలని ఈనెల 7వ తేదిన విజయవాడలో ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నాని జయప్రదం చేయాలని కోరారు. తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కే. నాగుల్ మీరా మాట్లాడుతూ జగన్, మోదీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఐ బస్సు యాత్ర చేపడుతుందన్నారు. దేశంలో రాజ్యాంగానికి ప్రజాస్వామ్యానికి చేటు కలిగించే విధంగా మోదీ ప్రభుత్వం నియంత పోకడలు అవలంభిస్తుందని మతవిద్వేషాలు రగిలించి మణిపూర్‌లో మరణ హోమం సృష్టిస్తున్నారని ఆరోపించారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దీర్ఘకాలంగా సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసు అమలు చేయాలని అర్హత కలిగిన రైతుకు ఐదువేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరువూరు పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయం మాట్లాడుతూ ఈనెల 9వ తేదిన జరిగే ఏఐటీయూసీ, సీఐటీయూలతో పాటు ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మిక వర్గాలకు పిలుపునిచ్చారు.

సుందరరావు పార్టీ నుంచి తొలగింపు:

తిరువూరు నియోజకవర్గ సమితి కొత్తపల్లి సుందర్‌రావు పార్టీ నాయకులు మీద భౌతిక దాడి చేయడం, పార్టీ వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొనడం, పార్టీ ఫండ్ సొంత ప్రయోజనానికి వాడుకోవటంతో పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మర్సకట్ల త్యాగరాజు, ఎస్‌కే హుస్సన్, ఉన్నం సాంబశివరావు, ఎస్‌కే నాగుల్ మీరా కార్పెంటర్, పైడిమల్లి రవి, నరసింహాద్రి వనమాలి, మోతే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

విద్యుత్ ఉద్యోగుల మహాధర్నాకు అనుమతి లేదు : సీపీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విద్యుత్ ఉద్యోగుల మహాధర్నాకు అనుమతిలేదని ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా టాటా స్పష్టం చేశారు. ఈనెల 8వతేదీన ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయిస్ జె.ఎ.సి. ఇతర విద్యుత్ సంఘాల ఆధ్వర్యంలో చలో విద్యుత్ సౌధ, మహాధర్నా కార్యక్రమాలు విజయవాడ నగరంలో జరుపుటకు పిలుపు ఇచ్చాయని, అటువంటి కార్యక్రమాలకు పోలీస్ అధికారుల వద్ద నుండి లేదా ప్రభుత్వం నుండి ఏ విధమైన అనుమతులు లేవని తెలిపారు. విజయవాడ నగరంలో సెక్షన్ 144 సిఆర్.పి.సి. పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 ప్రకారం నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని చెప్పారు. ధర్నా కార్యక్రమమునకు అనుమతులు నిరాకరించడం జరిగిందని, ప్రస్తుతం ఈఎస్ఎంఏ (ఎస్మా) ఎస్సెన్సియల్ సర్వీసెస్ మెయిన్టినేన్స్ యాక్ట్ అమలులో ఉందని, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ కూడా ఎస్సెన్సియల్ సర్వీసెస్ ఎస్మా చట్టం అమలులో వుంటుందన్నారు. ప్రభుత్వం జి.ఓ.ఆర్.టి.నెంబరు 54 ద్వారా అన్ని ఎలక్ట్రిసిటీ ట్రాన్స్మిషన్ కార్పోరేషన్ల యందు ఎస్మా చట్టాన్ని ఉదహరిస్తూ సదరు ఎలక్ట్రికల్ ట్రాన్స్మిషన్ కార్పోరేషన్ నందు ఉన్న మూడు ట్రాన్స్మిషన్ కంపెనీలు అనగా ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీ జన్కోలలో పనిచేసే వారికి ఎటువంటి సమ్మెలను చేయకుండా గత నెల మే 10వతేదీ నుండి ఆరు నెలల పాటు నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేయడం జరిగిందని తెలిపారు. ఎవరైనా ఈ ధర్నాలో పాల్గొంటే వారిపై ఎస్మా చట్టం క్రింద కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. తెలిసిన సమాచారం ప్రకారం కొంతమంది బయటి వ్యక్తులు ఈ ధర్నా కార్యక్రమములో చేరి హింసకు పాల్పడే అవకాశం ఉందని, గతంలో కూడా ఇలాంటి సంఘటనలు చాలా జరిగాయని తెలిపారు. నగరంలో 2000 మంది పోలీస్ సిబ్బంది, సి.సి.కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, విడియోగ్రఫి మొదలగు వాటి ద్వారా పటిష్టమైన నిఘా పెట్టి, పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, నేటి నుండి విజయవాడ వైపు వచ్చు వాహనాలు అన్నింటిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని చెప్పారు.

అన్నదానికి రూ.10,116 విరాళం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న తిరుపతమ్మ అమ్మవారి ఆలయం లో జరుగు అన్న దానం కు పెనుగంచిప్రోలు మండలం కొనకంచి గ్రామ వాస్తవ్యులు నాగసాని వెంకటనారాయణ తిరుపతమ్మ అమ్మవారి నిత్య అన్నదాన పథకమునకు 10 వేల 116 రూపాయలు ఆలయ కార్య నిర్వహణ అధికారి మరియు డిప్యూటీ కలెక్టర్ కె. రమేష్ నాయుడు ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావుల చేతుల మీదుగా విరాళంగా అందజేసినారు వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే ఆశీర్వచం చేసి తీర్ధ ప్రసాదములు అందజేసినారు.

అమ్మవారి ఉత్సవంలో వాడే ఛత్రములు బహూకరణ

పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మకి తమిళనాడు రాష్ట్రం చెన్నై నగరంలోని షావుకారు కాలనీ వాస్తవ్యులు ఎం రమేష్ లక్ష్మి శ్యామల దంపతులు తిరుపతమ్మ అమ్మవారి దేవస్థాన ఉత్సవాలకు ఊరేగింపులలో వాడే ఒక జత చత్రాలను అమ్మవారి దేవాలయం కార్యనిర్వహణ అధికారి కె.రమేష్ నాయుడుకు అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులు ఆలయ పురోహితులచే ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

వీర ఆంజనేయస్వామికి ఉచిత దర్శనం ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-గంపలగూడెం : మేదురు వీర ఆంజనేయ స్వామి దేవాలయంలో కొత్తగా పెట్టిన అంతరలయ దర్శనం టిక్కెట్ 100 రూపాయల తొలిగించి ఉచిత అంతరలయ దర్శనం ఏర్పాటు చేయాలి అని కోరుతూ మేదురు శ్రీ వీర ఆంజనేయ స్వామి భక్త బృందం ఆదివారం అలయ ఇవో వేంకటేశ్వర రావు విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు, ఈ కార్యక్రమానికి కాజా రవి కుమార్ , నేరళ్ళ యుగంధర్,కే నాగ గోపాల కృష్ణ,పేట అప్పారావు, అన్నవరపు క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ప్రజానాట్య మండలి నివాళులు



విశాలాంధ్ర-విజయవాడ : ప్రజా గాయకుడు ప్రజల కోసం దళితుల కోసం అనగారిన వర్గాల కోసం అహర్నిశలు శ్రమించి శ్రమిస్తూ తుదిశ్వాస వరకు తన పాటను ప్రజల కోసమే వినియోగించిన గద్దర్ చనిపోవడం చాలా బాధాకరం అని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి విజయవాడ సమితి ఘనంగా నివాళులర్పించింది. ఈ మేరకు ప్రజానాట్య మండలి సభ్యులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గద్దర్ అనేక సినిమాలలో ఒక చక్కటి సాహిత్యాన్ని అందించారని, తాను రాసిన రచనలు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు కూడా అనేక సందర్భాల్లో అనేక వేదికల పైన పాడుకుంటూ ప్రజల్ని చైతన్యపరచిన సంఘటనలు అనేక ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. ఇటు ఆంధ్రాలో అటు తెలంగాణలో ప్రజా కళాకారులకు ఎంతో స్ఫూర్తినిచ్చిన గద్దర్ లేరనే నిజాన్ని జీర్ణించుకోవడం చాలా కష్టమని పేర్కొన్నారు. గద్దర్ మృతికి తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చారు. నగర ప్రజానాట్యమండలి ఇన్చార్జి లంక దుర్గారావు, గౌరవ అధ్యక్షులు కేవీ భాస్కరరావు, నగర అధ్యక్షులు ఎస్ కే నజీర్, నగర కార్యదర్శి డి సూరిబాబు,కోశాధికారి చిన్నప్ప, ఎస్ రంగారావు, ఎస్ కే భాష తదితరులు నివాళులర్పించారు.

ప్రజా గాయకుడు గద్దర్ మృతి బాధాకరం: ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ సంతాపం

ప్రజా గాయకుడు, పాటను చిరునామాగా చేసుకున్న వాగ్గేయకారుడు గుమ్మడి విఠల్ రావు (గద్దర్) ఆదివారం హైదరాబాద్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణించారు. వారి మరణం పట్ల ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ ఓ ప్రకటనలో దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆయనకు సంతాపం ప్రకటించింది. గద్దర్ విద్యార్థి దశనుండి విప్లవ రాజకీయాలతో విప్లవ కళాకారుడిగా, సాంస్కృతిక నాయకునిగా ప్రజా ఉద్యమాలకు ఊపిరిగా నిలిచారు. తుపాకీ గుండ్లను ఎదురొడ్డి చావు అంచువరకు వెళ్లివచ్చినవాడాయన. ఎందరో కళాకారులకు స్ఫూర్తిగా నిలిచారు. ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎక్కువ భాగం పాటతో పెనవేసుకున్నదే. గద్దర్ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్షులు చావా రవి, కార్యదర్శి కొండా రాజేశ్వరరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మరాజు చలపతిరావు, ఆర్ వసంత్, ఐజేయూ కౌన్సిల్ మెంబర్ ఎస్కే బాబు, కూనా అజేయ్ కుమార్, పీ వీ కృష్ణారావు, ఎస్ సాంబశివరావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు దారం వెంకటేశ్వరరావు, దాసరి నాగరాజు, జి రామారావు, స్సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి సంతాపం ప్రకటిస్తూ, ఆయన కుటుంబానికి సానుభూతి వ్యక్తపరిచారు.

'మోదీ హటావో.. దేశ్ బచావో'

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : దేశం, ప్రజల ప్రయోజనాలు కాపాడు కోవటానికి మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తి తో ఈ నెల 9వ తేదీన జరిగే దేశ వ్యాప్త ప్రదర్శనలు విజయవంతం చేయాలని కోరారు. విజయవాడ కళేశ్వరరావు మార్కెట్ వస్త్రలత వద్ద ఆదివారం కార్మిక సంఘాల ఆధ్వర్యం లో మానవ హారం నిర్మించారు .ఏఐటియూసీ ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, కార్యదర్శి కొట్టు రమణరావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ. వి.నాగేశ్వర రావు, వి. ఉమా మహేశ్వర రావు, ఏఐఎఫ్‌టీయూ లక్ష్మణ, ఐ ఎఫ్‌టీయు ఎ.రవిచంద్ర, రామకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాల మోడి పాలన లక్షల కోట్ల అప్పుల భారం దేశం పై మోపిందని చెప్పారు. కార్పొరేట్ లకు మేలు చేసే విధానాలు తెచ్చి ప్రజల పై భారాలు మోపిందన్నారు. నిత్యావసర వస్తువులు, గ్యాస్, విద్యుత్, రవాణా , పన్నులు విపరీతంగా పెరిగాయని చెప్పారు. ప్రభుత్వ రంగం అమ్మటం, లీజు కివ్వటం చేసి ప్రజల ఆస్తులు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్న దన్నారు. విశాఖ ఉక్కు అమ్మాలని చూస్తుందని తెలిపారు. రైతులకు వ్యతిరేకంగా తెచ్చిన చట్టాలు రద్దు చేసినా వారికిచ్చిన హామీలు అమలు చేయ లేదని వివరించారు . పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దు చేసి కార్మికులకు వ్యతిరేకంగా కోడ్ లు తెచ్చిందన్నారు . నూతన విద్యా విధానం తో నష్టదాయక మార్పులు తెస్తున్నదని చెప్పారు . ఎవరైనా ఈ విధానాలు ప్రశ్నిస్తే వారిని దేశ ద్రోహులు గా చిత్రిస్తున్నారని తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటం లో పాల్గొనని వారిని, తూట్లు పొడిచిన వారిని బిజెపి కీర్తిస్తూ ప్రజలను ప్రక్క త్రోవ పట్టిస్తున్నదని, చరిత్ర వక్రీకరిస్తున్నదని చెప్పారు. మతం, కులం, ఇతర విచ్ఛిన్న వాదాలతో జనం మధ్య చిచ్చు రగిల్చి తన ఆర్థిక విధానాలు వేగంగా అమలు చేసిందన్నారు . ఇలాంటి ప్రభుత్వం కొనసాగటం దేశానికి ప్రజలకు క్షేమం కాదని చెప్పారు. ఇది గమనించి మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసీ నాయకులు తిరుపతయ్య, రామస్వామి, సిహెచ్.రమణ, సిఐటియు జిల్లా నాయకులు ఎ వెంకటేశ్వర రావు, ఎంవి సుధాకర్, ఇవి నారాయణ, కె దుర్గా రావు, ఎం సీతారాములు, ఐ ఎఫ్ టి యు పెద్దిరాజు, ముని శంకర్ తదితరులు పాల్గొన్నారు .

నేటి నుండి జాతీయ చేనేత వారోత్సవాలు

విశాలాంధ్ర-విజయవాడ : జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు చేనేత వినియోగాన్ని ప్రోత్సహించేలా విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చేనేత, జౌళి శాఖ కమీషనర్, ఆప్కో ఎండి ఎంఎం నాయక్ తెలిపారు. చేనేత, జౌళి శాఖ, ఆప్కో సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 7 జాతీయ చేనేత వారోత్సవాలను ఘనంగా ప్రారంభించనున్నామన్నారు. నగరంలోని మేరీస్ స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియం ఈ కార్యక్రమాలకు వేదిక కానుందన్నారు. సోమవారం నుండి 12 వరకు హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని, జాతీయ స్థాయిలో సైతం పేరు ప్రఖ్యాతులు గడించిన 50కి పైగా చేనేత ఉత్పత్తి సంఘాలు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయన్నారు. తొలిరోజు సాయంత్రం ఆప్కో నేతృత్వంలో చేనేత ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నామని నాయక్ వివరించారు.

మైక్రో ఆర్టిస్ట్ నడిపల్లికి జీవిత సాఫల్య పురస్కారం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : సృజన ఆర్ట్ క్రియేషన్స్(హైదరాబాద్)సాంస్కృతిక సంస్థ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డ్స్ 2023 ప్రదానోత్సవ సభా వేదికపై ప్రఖ్యాత అతి సూక్ష్మ చిత్రకారులు లయన్ డాక్టర్ నడిపల్లి రవికుమార్ జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఆదివారం ఉదయం తెలంగాణ సారస్వత హాలులో పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్ట్ టీచర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న రవికుమార్ తెలంగాణ నీటిపారుదల శాఖ చైర్మన్ డాక్టర్ ఎస్ వేణుగోపాలచారి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రకారునిగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం పొంది,25 ప్రపంచ రికార్డులు,300 బిరుదులు,పురస్కారాలు,గౌరవ డాక్టరేట్లు, సన్మానాలు, సత్కారాలు పొందిన ఆయనకు తన చేతులు మీదుగా పురస్కారం ప్రదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర మాజీ చీఫ్ విప్ రుద్రరాజు పద్మరాజు,సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఎం రాజేష్,తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఇదే వేదికపై సంగీతం,నాట్యం,డ్రాయింగ్,సేవ పలు రంగాలలో పేరు గడించిన 12 మందికి జాతీయ సమైక్యత అవార్డులను ప్రదానం చేశారు.

'పశ్చిమ'లో సెకండ్ విన్నింగ్ సెంటిమెంట్

- ఇప్పటి వరకు వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా ఒక్కరూ గెలవలేదు
- రాజకీయ ఉద్దండులకు సైతం వరుస ఎన్నికల్లో రెండోసారి తప్పని ఓటమి
- ఒకే పార్టీ తరపున అభ్యర్థులు మారితే గెలిచిన వైనం
- ఈసారి అధికార పార్టీలో సెంటిమెంట్‌పై జోరుగా చర్చ



విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో అప్పుడే ఎన్నికల వేడి మొదలైంది. పొత్తులు, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలకు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ... గెలుపు ఓటములపై సెంటిమెంట్ల గురించి జోరుగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు వరుసగా రెండోసారి ఎవరూ గెలవకపోవడం సెంటిమెంట్‌గా మారింది. ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసిన రాజకీయ ఉద్దండులకు సైతం వరుస ఎన్నికల్లో రెండోసారి ఓటమి తప్పలేదు. అయితే, అభ్యర్థులు మారిన సందర్భాల్లో వరుసగా ఒకే పార్టీ రెండుసార్లు గెలుపొందిన చరిత్ర ఉంది. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో అధికార పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఐప్యాక్ టీం నియోజకవర్గాల వారీగా సర్వే చేస్తోంది. అదే సమయంలో వైసీపీ కీలక నేతలు తిరుపతి కేంద్రంగా మరో బృందంతో సర్వే చేయిస్తున్నారు. దీంతో ఈ సర్వే బృందాలు సెంటిమెంట్‌ను గుర్తిస్తాయా... ప్రజల్లో జోరుగా సాగుతున్న చర్చను వైసీపీ అధిష్టానం దృష్టికి తీసుకువెళతాయా... ఒకవేళ తీసుకువెళితే అధిష్టానం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుంది... సిట్టింగ్ ఎమ్మెల్యేకే సీటు ఇస్తుందా... సెంటిమెంట్‌ను పరిగణనలోకి తీసుకుని కొత్తవారికి అవకాశం ఇస్తుందా... అనే అంశంపై జోరుగా చర్చసాగుతోంది.

నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇలా...

దేశంలో స్వాతంత్ర్యం అనంతరం 1952లో తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పుడు విజయవాడ ఒక్కటే అసెంబ్లీ నియోజకవర్గం. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మరుపిళ్ల చిట్టిపై భారత కమ్యూనిస్టు పార్టీ నేత తమ్మిన పోతరాజు ఘన విజయం సాధించారు. ఆ తర్వాత 1955 ఎన్నికల నాటికి విజయవాడ ఉత్తర, దక్షిణ నియోజకవర్గాలు ఏర్పడాయి. నాడు విజయవాడ ఉత్తర నియోజకవర్గంగా ఉన్న ప్రస్తుత పశ్చిమ నియోజకవర్గం నుంచి 1955 ఎన్నికల్లో సీపీఐ తరఫున మళ్లీ పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే తమ్మిన పోతరాజుపై మరుపిళ్ల చిట్టి (కాంగ్రెస్) గెలుపొందారు. మళ్లీ 1962 ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే మరుపిళ్ల చిట్టిపై తమ్మిన పోతరాజు గెలుపొందారు. ఇక విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఏర్పడిన 1967 ఎన్నికల్లో మళ్లీ తమ్మిన పోతరాజుపై మరుపిళ్ల చిట్టి విజయం సాధించారు. ఇలా నాలుగు ఎన్నికల్లో ఒకసారి పోతరాజు, మరోసారి మరుపిళ్ల చిట్టి చొప్పున రెండేసిసార్లు గెలుపొందారు. అయితే, 1972లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ఆసిఫ్ పాషా గెలుపొందారు. దీంతో అభ్యర్థి మార్చిన తర్వాత పశ్చిమ నియోజకవర్గం నుంచి తొలిసారి కాంగ్రెస్ పార్టీ వరుసగా రెండుసార్లు విజయం సాధించింది. ఆ తర్వాత 1978 ఎన్నికల్లో కాంగ్రెస్-ఐ తరఫున పోటీ చేసిన పోతిన చిన్నా గెలుపొందారు. అనంతరం 1983లో టీడీపీ నుంచి పోటీ చేసిన బీఎస్ జయరాజు, 1985లో సీపీఐ నేత ఉప్పలపాటి రామచంద్రరాజు, 1989లో కాంగ్రెస్ తరఫున ఎంకే బేగ్ విజయం సాధించారు. అదేవిధంగా 1994 ఎన్నికల్లో సీపీఐ తరఫున పోటీ చేసిన కాకర్లపూడి సుబ్బరాజు, 1999లో కాంగ్రెస్ నుంచి జలీల్‌ఖాన్, 2004లో సీపీఐ అభ్యర్థి షేక్ నాసర్‌వలీ గెలుపొందారు. ఇక 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ తరఫున పోటీ చేసిన వెలంపల్లి శ్రీనివాసరావు, 2014లో వైసీపీ అభ్యర్థి జలీల్‌ఖాన్ విజయం సాధించారు. గత 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన వెలంపల్లి శ్రీనివాసరావు గెలుపొందారు. మొత్తం 1952 నుంచి ఇప్పటి వరకు పరిశీలిస్తే సీపీఐ, కాంగ్రెస్, కాంగ్రెస్-ఐ, టీడీపీ, వైసీపీ అభ్యర్థులు పశ్చిమ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. అయితే, ఏ ఒక్కరు కూడా వరుసగా రెండుసార్లు గెలుపొందలేదని, ఈసారి ఆ సెంటిమెంట్ కొనసాగుతుందా... అన్ని ప్రధాన పార్టీలకు చావో.. రేవో తేల్చుకునే దశలో ఉన్న 2024 ఎన్నికల్లో ఈ నియోజకవర్గం సీటును ఎవరికి ఇస్తారు... ఏం చేస్తారనే అంశంపై ఇప్పటి నుంచి జోరుగా చర్చసాగుతోంది.

నగరంలో ప్రేమ్ కుమార్ చిత్ర యూనిట్ సందడి

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: విజయవాడ నగరంలో ప్రేమ్ కుమార్ చిత్ర యూనిట్ సందడి చేసింది. హీరో సంతోష్ శోభన్ నటించిన ప్రేమ్ కుమార్ చిత్రం ప్రమోషన్ లో భాగంగా బందర్ రోడ్ లోని ఒక హోటల్లో చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ విజయవాడ నగరం నుంచి తమ చిత్రం ప్రమోషన్ కార్యక్రమం ప్రారంభించడం సంతోషంగా ఉందని, తన చిత్రాలన్నీ విజయవాడ నుంచే ప్రమోషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. తాను నటించిన ప్రేమ్ కుమార్ చిత్రం ఈనెల 18వ తేదీన థియేటర్లలో విడుదల కానుంది అని తెలిపారు. పెళ్లి కోసం పాట్లు పడే క్యారెక్టర్ లో తాను కొత్తగా కనిపించనున్నానని తెలియజేశారు . ఈ చిత్రంలో కామెడీ ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తుందని చెప్పారు. ఈ చిత్రంలో రాసిసింగ్,రుచిత ఇద్దరు హీరోయిన్లు ఉన్నారని వారిలో ఎవరితో పెళ్లి జరుగుతుంది అనేది సినిమా చూస్తే తెలుస్తుందని అన్నారు.. ఈ చిత్రంలో నటించిన నటీనటులందరూ వారి పాత్రకు తగిన న్యాయం చేశారని, ప్రేక్షకులు ఈ చిత్రాన్ని తప్పక వీక్షించి తమను ఆదరించాలని ఆయన కోరారు. దర్శకుడు అభిషేక్ మహర్షి మాట్లాడుతూ ఈ చిత్రాన్ని కామెడీ ఎంటర్టైనర్ గా నిర్మించారని పేర్కొన్నారు. తదనంతరం హీరోయిన్ రాశి సింగ్ మాట్లాడుతూ తన మొదటి చిత్రం సంతోష్ శోభన్ తో నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

లింగాల వంతెనకు మరమ్మతులు చేయాలి

విశాలాంధ్ర-వత్సవాయి: మునేరు వరద ఉధృతికి ధ్వంసమైన శిథిలమైన లింగాల వంతెనకు వెంటనే మరమ్మతులు చేసి, రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు పునరుద్ధరించాలని సీపీఐ, టీడీపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరద ఉధృతికి శిథిలమైన లింగాల వంతెనను సీపీఐ, టీడీపీ తెదేపా నాయకులు ఆదివారం పరిశీలించారు. పోలంపల్లి, లింగాల గ్రామంలో వరద ఉధృతికి శిథిలమైన లింగాల వంతెనను తాతయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కన్వీనర్ చుండూరు సుబ్బారావు మాట్లాడుతూ రెండు రాష్ట్రాలకు అనుసంధాన వారధిగా ఉన్న లింగాల వంతెన నాణ్యత లోపంగా చేస్తున్నారని ఆరోపించారు. వరద ఉధృతికి వంతెనపై కాంక్రీట్ స్లాబులు శిథిలమయ్యాయని వాటి స్థానంలో కొత్త స్లాబులు నిర్మాణం చేయకుండా పాత వాటిని సరి చేస్తున్నారని ఆరోపించారు. ఈ మరమతులతో ఎటువంటి ఉపయోగం లేదని అన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ వంతెనకు గతంలో ఉన్న పెండింగ్ పనులకు గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. మునేరుకు గత నెలలో వచ్చిన వరద ఉధృతికి వంతెన పూర్తిగా శిథిలమైందన్నారు. వరద తీవ్రతకు రాకపోకలు నిలిచిపోయి 15 రోజులు అవుతున్నా ప్రభుత్వం పటిష్టమైన మరమ్మతులు చేపట్టడంలో పూర్తిగా విఫలం చెందిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రతిష్టమైన మరమ్మతులు వెంటనే చేయించాలని, కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తాతయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు వల్లంకొండ బ్రహ్మం, జగ్గయ్యపేట నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు పొన్నం నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జక్కులూరి వెంకటేశ్వర్లు, సీపీఐ ముచ్చింతల కార్యదర్శి రవి, గద్దం శ్రీనివాసరావు, వడ్లమూడి రాంబాబు, సీతారామయ్య, జొన్నలగడ్డ రాధాకృష్ణమూర్తి, వేగినేటి గోపాలకృష్ణ, గద్దం హుస్సేన్ (ఏసుబాబు), ఉయ్యూరి అప్పారావు, చిట్టూరి సుభాష్, కర్ల వెంకటనారాయణ, పొన్నం నరసింహారావు,గజ్జి కృష్ణమూర్తి, యార్లగడ్డ విశ్వనాథం, తోట నాగమల్లేశ్వరరావు, కిలారు సూర్యనారాయణ, కిలారు విశ్వనాథ్ (చిన్ని), నంబూరి శ్రీనివాసరావు, కంభంపాటి పుల్లారావు, వంకాయలపాటి బ్రహ్మం,సామినేని నాగేశ్వరరావు,పోధిల అప్పారావు,గోపి, ఆధిమల్ల శ్రీను,పొన్నం బాలాజీ, నల్లపునేని కొండ, ఉప్పుగండ్ల రాధాకృష్ణ, వడ్లమూడి శ్రీను, మాదినేని విక్రం, కణతాల రామకృష్ణ, చెన్న బాలకృష్ణ, అబ్బూరి వెంకటేశ్వరరావు, మన్నేపల్లి నరసింహారావు, మునగాల వంశీ, కంచెటి రమేష్,కంచెటి రాంబాబు, నరసింహారావు, నటుకుల బాబురావు తదితరులు పాల్గొన్నారు